

రూ.1,00,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవనానికి యానానికి చెందిన గుబ్బల పరంజ్యోతి దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు.




రెక్కలు తొడిగి.. రెపరెపలాడి

పడమర చోడవరానికి వేల మైళ్ల నుంచి సైబీరియా పక్షులు వచ్చి సందడి చేస్తుంటాయి. సంతానోత్పత్తి చేసి మళ్లీ తిరిగి వెళ్లిపోతాయి.

8లో▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 4,08,157 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 7.10 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్‌కు మూడు డెల్టా కాలువలకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

అనంత శేషగిరికి స్వర్ణ కంకణం



అనంత శేషగిరిని స్వర్ణ కంకణంతో సత్కరిస్తున్న నిర్వాహకులు

తుని: తునికి చెందిన జ్యోతిష, ఆరా ఎనర్జీ వాస్తు నిపుణుడు అనంత శేషగిరి ఈమనిని స్వర్ణ కంకణంతో సత్కరించారు. ఆదివారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. తునికి చెందిన అనంత శేషగిరి ఈమనికి సువర్ణ కంకణాన్ని రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి బహూకరించారు. ప్రశంసా పత్రంతో పాటు ఆరా ఎనర్జీ వాస్తు విభూషణ బిరుదుతో సత్కరించారు. తొమ్మిది రాష్ట్రాలకు చెందిన వాస్తు ప్రతినిధులు హాజరయ్యారని అనంత శేషగిరి తెలిపారు. తునికి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

లోవకు పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

తుని: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం తలుపులమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శ్రావణం మాసం తొలి ఆదివారం కావడంతో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం 6 నుంచి సాయంత్రం వరకు 8 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈఓ విశ్వనాధరాజు తెలిపారు. దేవస్థానానికి చెందిన కాటేజీలు నిండి పోవడంతో ప్రైవేటు కాటేజీలను భక్తులు ఆశ్రయించారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,57,100, పూజా టికెట్ల ద్వారా రూ.97,350, కేశఖండన ద్వారా రూ.7,160, వాహన పూజ టికెట్ల ద్వారా రూ.4,400, కాటేజీల ద్వారా రూ.89,212, ఇతర విభాగాల నుంచి రూ.1,11,287 కలిసి రూ.4,67,509 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రద్దయిన రైళ్ల పునరుద్ధరణ

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తూ గతంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించినట్టు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆదివారం తెలిపారు. తిరుమల, ఉదయం, రత్నాచల్, విశాఖపట్నం–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సింహాద్రి, విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, రాజమహేంద్రవరం – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, గుంటూరు–రాయగడ ఎక్స్‌ప్రెస్‌లకు ఆదివారం నుంచి బుకింగ్ ప్రారంభించామన్నారు. ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు. సుమారు 50 రోజుల క్రితం ఈ రైళ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే.

మహిళలకు రూపుల బహూకరణ



బంగారు రూపులు గెలుపొందిన మహిళలతో కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు

లక్కీ డ్రాలో 92 మంది ఎంపిక

గోకవరం: గోకవరంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బంగారు వరలక్ష్మీ కానుక–2 పేరుతో ఆదివారం లక్కీడ్రా నిర్వహించారు. గతేడాది 63 మంది మహిళలకు గ్రాము బంగారు రూపులను అందజేయగా ఈ యేడాది గోకవరంలో 92 మందికి లక్కీడ్రా ద్వారా బంగారు రూపులు అందించారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన ఆయన ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించే మహిళలకు బంగారు రూపులు ఇస్తామని నెలరోజుల క్రితం ప్రకటించారు. సుమారు 4 వేల మంది రిజిస్టర్ చేసుకోగా ఆదివారం స్థానిక సూర్యఫంక్షన్ హాలులో మహిళల సమక్షంలో లక్కీ డ్రా తీసి 92 మందికి ఆ దంపతులు రూ.7,500 విలువ చేసే గ్రాము బంగారు రూపులను అందజేశారు. నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు సుమారు 300 మందికి కానుకలు ఇచ్చామని, సోమవారం కూడా ఇస్తామని పేర్కొన్నారు.

వర్మకు దొరాఘాతం

- కూటమి నేతల మధ్య కోల్డ్ వార్
- కూటమిలో చేరతానన్న దొరబాబు
- వర్మకు ప్రాధాన్యం తగ్గించే ఎత్తుగడ
- తొలి ఎమ్మెల్సీ అని చంద్రబాబు దగా



సాక్షి ప్రతినిధి, కాకినాడ: పిఠాపురంలో కూటమి నేతల్లో వర్గపోరు ముదిరి పాకాన పడుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనే వీరి ఆధిపత్య పోరు కొనసాగుతుండగా వారికి మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు రూపంలో మరో తలపోటు వచ్చి పడింది. పిఠాపురం ఎమ్మెల్యే, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కల్యాణ్ నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చి పోయే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఎప్పుడైతే పవన్ ఉప ముఖ్యమంత్రి అయ్యారో ఆ రోజు నుంచే పిఠాపురంపై పెత్తనం కోసం నేతలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమితో జత కట్టిన పవన్ కల్యాణ్ కోసం పిఠాపురం స్థానాన్ని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ త్యాగం చేసి గెలుపు కోసం కష్టపడ్డారు. ఫలితంగా ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి ఎమ్మెల్సీగా వర్మకు అవకాశం కల్పిస్తామని బాబు మాట ఇచ్చారు. పవన్ కూ డా వర్మను ఆకాశాన్నికెత్తేసినంత పనిచేస్తూ వెంట తిప్పుకున్నారు. ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటవడం.. పిఠాపురం నుంచి గెలిచిన పవన్ కల్యా ణ్ ఉప ముఖ్యమంత్రి కావడం చకచకా జరిగిపోయా యి. ఇంతలోనే మండలిలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ రానే వచ్చింది. తొలి ఎమ్మెల్సీ తనదేనని వర్మ గంపెడాశలు పెట్టుకుని తనకే ఆ ఇస్తారని అనుచరులు అందరికీ వర్మ చెప్పేసుకున్నారు. మాట ఇచ్చి మరచిపోవడంలో దిట్ట అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు పవన్ కోసం పిఠాపురం సీటు త్యాగం చేసిన వర్మకు జెల్ల కొట్టి ఆ సీటును రామచంద్రయ్యకు ఇచ్చేశారు. జనసేన నుంచి పిడుగు హరిప్రసాద్‌కు పవన్ సిఫార్సుతో లభించింది. మొదటి అవకాశంలోనే అందలం ఎక్కిస్తారనుకున్న వర్మ ఆశలపై నీళ్లు చల్లారు. వర్మకు ఎమ్మెల్సీ చాన్స్ రాకుండా తెర వెనుక జనసేన నేతలు బ్రేకులు వేశారనే చర్చ ఇరుపార్టీల నేతల మధ్య సాగింది.



మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ



మాజీ ఎమ్మెల్యే దొరబాబు

తార్కాణాలెన్నో

ఎమ్మెల్సీ దక్కని అవమానం జీర్ణించుకోకుండానే పవన్ అలా వెళ్లగానే ఇలా వర్మ ప్రాధాన్యాన్ని తగ్గించేలా జనసేన నేతలు వ్యవహరిస్తుండటం మొదలు పెట్టారని ఆనోటా ఈనోటా అంటున్న మాట. ఇందుకు అనేక ఉదాహరణలను వర్మ అనుచరవర్గం ఎత్తి చూపుతోంది. పవన్ స్వానే సోదరుడు నాగబాబు నియోజకవర్గంలో అధికార, అనధికార వ్యవహారాలను తనే స్వయంగా చక్కబెడుతున్నారు. అంతే కాకుండా తాను లేదా, మర్రెడ్డి శ్రీనివాస్ సిఫార్సులకే ప్రాధాన్యం ఇవ్వాలని నాగబాబు ఇటీవల పలు సమీక్షల్లో స్పష్టం చేశారని గుర్తు చేస్తున్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేగా, టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న వర్మకు కనీస ప్రాధాన్యం లేకుండా చేయడంతో ఆ వర్గం రగిలిపోతోంది. అలాగని బయటపడి వివాదాలకు పోకుండా అతని అనుచరులు సమయం కోసం కాసుకుని కూర్చున్నట్టుగా కనిపిస్తోంది.


త్యాగానికి అడుగడుగునా అవమానం

పవన్ కోసం త్యాగం చేసిన పాపానికి వర్మను అడుగడుగునా అవమానిస్తున్నారని ఆ వర్గం కారాలు మిరియాలు నూరుతోంది. ఏ క్షణానైన్నా వర్మ వర్గం రోడ్డెక్కే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కూటమిలో చేరనున్నట్టు ఇటీవల ప్రకటించడం వర్మ వర్గీయుల్లో అగ్గి రాజేసింది. కూటమిలో చేరుతానన్న దొరబాబును తేదేపాలో చేర్చుకుంటే మాత్రం మూకుమ్మడిగా పార్టీని వీడి బయటకు పోవాలనే యోచనలో వర్మ వర్గం ఉందనే ప్రచారం సాగుతోంది. ఇటు జనసేన నేతలు కూడా దాదాపు ఇదే అభిప్రాయంతో ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికే పిఠాపురంలో కూటమిలోని తేదేపా, జనసేన నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ తలపోట్లు సరిపోవన్నట్టు ఇప్పుడు దొరబాబు కూటమిలోకి వస్తే అతనికిచ్చే ప్రాధాన్యం ఏమిటనే ప్రశ్న కూటమి నేతలు ఆయా పార్టీల ముఖ్య నేతలకు సంధిస్తున్నారు. సీటు త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మకు ప్రాధాన్యం లేకపోగా, ఇప్పుడు కొత్తగా దొరబాబును తీసుకువచ్చే ప్రయత్నాలపై వర్మ వర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది. వర్మను పొమ్మనకుండా పొగ డబెట్టే ఎత్తుగడతోనే దొరబాబును తీసుకువస్తున్నారనే ప్రచారం పిఠాపురంలో విస్తృతంగా జరుగుతోంది. ఎన్నికలు అయిపోయాక ఇప్పుడు దొరబాబును కూటమిలోకి తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఇరుపార్టీల నేతలు ముఖ్య నేతలను ప్రశ్నిస్తున్నారు.

ఏలేరుకు జలకళ

- ప్రస్తుత నిల్వ 16.06 టీఎంసీలు
- దిగువ ఆయకట్టుకు ధీమా

ఏలేశ్వరం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో పడడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు ఒక్కసారిగా పెరిగాయి. వర్షాలకు జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 2647 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఆదివారం నాటికి 86.56 మీటర్లకు గాను 82.12 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 16.06 టీఎంసీలకు చేరుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు చేరడంతో దిగువ ప్రాంతాలకు 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో మరింతగా నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటినిల్వలు పెరగడంతో దిగువ ఆయకట్టుకు ఢోకా లేదు. ఆయకట్టులో సుమారు 54 వేల ఎకరాల సాగుకు నీరందించేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలకు ఆయకట్టుతో పాటు విశాఖకు నీటిఎద్దడి ప్రమాదం తప్పింది. నీటినిల్వలు పెరగడంతో దిగువ ఆయకట్టుతో పాటు విశాఖ, తిమ్మరాజు చెరువు, పంపా ప్రాజెక్టుకు నీటి విడుదలకు ఇబ్బంది లేదని అధికారులు పెర్కొన్నారు.



ప్రాజెక్టు గేట్ల వద్ద గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వలు

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి

- 40 వేల మంది రాక
- ఘనంగా సత్యదేవుని రథోత్సవం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధిన శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అనంతరం నవ దంపతులు, ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి తరలివచ్చి వ్రతాలు చేసుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో వ్రతమండపాలు, స్వామివారి దర్శనం అనంతరం సేదతీరే భక్తులతో విశ్రాంతి మండపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు మూడు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది.

కన్నుల పండువగా..

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. అనంతరం దేవేరులతో స్వామివారిని రథంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ రమేష్ బాబు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. తరువాత ఆలయ ప్రాకారంలో రథానికి నాలుగు దిక్కుల కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, వ్రత పురోహితులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సత్యదేవుని రథోత్సవంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఇతర అధికారులు

బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలి

ఏఐఐసీ ఈయూ జోనల్ జాయింట్ సెక్రటరీ తిరుపతయ్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య అన్నారు. ఆదివారం స్థానిక మోడల్‌కాలనీలో యూనియన్ భవనంలో రాజమండ్రి ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో 'కేంద్ర బడ్జెట్–ఉపాధి కల్పన–అవకాశాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య వక్తగా తిరుపతయ్య పాల్గొని మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్య, మౌలిక వసతుల ప్రాజెక్టు కోసం ఎక్కువ మొత్తాల్లో కేటాయించడం ద్వారా కార్మికులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు కేటాయింపులు మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సదస్సును ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు ఏర్పాటు చేసినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ స్వాగత ఉపన్యాసంలో పేర్కొన్నారు. యూనియన్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎల్ఐసీ యూనియన్ నాయకులు ఎ.సుబ్బారావు, ఎస్.గనెయ్య, ఏకే విశ్వనాథ్, బి.శ్రీనివాస్, ఐవీ సుధాకర్, జి.శ్రీనివాస్ తదితరులతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తిరుపతయ్య

బాబు మార్కు సిఫార్స్

- నామినేటెడ్ పదవులపై పూటకో మాట
- తొలుత ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో కొందరికి మొండిచేయి
- తాజాగా ఎమ్మెల్యే లేఖలకే ప్రాధాన్యమని వెల్లడి
- బాబు వైఖరిపై తమ్ముళ్ల అసంతృప్తి



సాక్షి, రాజమహేంద్రవరం: నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవహార శైలి పార్టీ శ్రేణుల్లో అగ్రహావేశాలు నింపుతోంది. రోజుకో మాట.. పూటకో ప్రతిపాదన తెరపైకి వస్తుండటంతో సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన తమకు నామినేటెడ్ పదవులు దక్కుతాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటి వరకు పార్టీ కోసం శ్రమించిన నేతలకు పట్టం కడతామన్న చంద్రబాబు.. తాజాగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతలకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ లింకులు పంపి వారితో ఆశావహుల పేర్లను తెప్పించుకోవడాన్ని బట్టి చూస్తే కష్టపడిన వారికి పదవులు దక్కే పరిస్థితి కనిపించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదునుగా భావించిన తూర్పుగోదావరి జిల్లాలోని కొందరు నేతలు తమ బంధువులు, తమ అనుయానులు, నమ్మినబంట్లకు పదవులు కట్టబెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

సిఫార్సులకు పెద్దపీటా?

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే స్థానాలు దక్కని, క్రియాశీల పాత్ర పోషించిన పార్టీ శ్రేణులకు నామినేటెడ్ పదవులు ఇస్తామన్న సీఎం చంద్రబాబు ప్రకటనతో ఆశావహులు సంబరాలు చేసుకున్నారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతుందని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఆశించారు. ఆగస్టు నెలలోపు అన్ని పదవులు భర్తీ చేస్తామని స్పష్టీకరించడంతో ఉత్సాహంగా టీడీపీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిల సిఫార్సు లేఖలు సైతం దరఖాస్తులకు జత చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీకి పెద్ద ఎత్తున దరఖాస్తులు చేరాయి. ఇంకేముంది పదవి రావడమే తరువాయి అని అనుకుంటున్న తరుణంలో చంద్రబాబు ఎంపికలో కొత్త మెలిక పెట్టారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, ఇతర ప్రధాన నేతలకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ లింక్‌ను పంపినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం.

ఇప్పటికే ఐవీఆర్ఎస్ సర్వే

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలన్న ఉద్దేశంతో అలవిగాని హామీలు గుప్పించారు టీడీపీ అధినేత చంద్రబాబు. ఆయన మాటలకు ఆకర్షితులైన టీడీపీ శ్రేణులు పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చింది.. ఇంకేముంది నామినేటెడ్ పదవులు వరిస్తాయన్న టీడీపీ శ్రేణుల ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లు చల్లారు. పార్టీ నిర్వహించే సర్వేలో ఉత్తముడని తేలితేనే పదవి కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ఐవీఆర్ఎస్ పేరుతో ప్రజలకు ఫోన్లు, వాట్సాప్ లింక్‌లు పెట్టి అభిప్రాయాల సేకరణ చేపట్టారు. నియోజకవర్గ, పార్లమెంట్, గ్రామ స్థాయి పోస్టుల కోసం కష్టపడిన వారి పేర్లతో సర్వే విస్తృతం చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఐదుగురి పేర్లతో సర్వే చేపట్టారు. పార్టీ శ్రేణులు, ప్రజలకు నేరుగా ఫోన్లు చేయడం నామినేటెడ్ పదవి ఆశిస్తున్న వారి పేర్లతో అభిప్రాయాలు సేకరించారు. ఎవరైతే బాగుంటుంది? అని ఆరా తీశారు.

పంపకాలతో పరేషాన్

నామినేటెడ్ పోస్టుల పంపకాలపై కసరత్తు ప్రారంభించిన చంద్రబాబు కూటమి నేతలను పక్కనబెడితే వ్యతిరేకత వ్యక్తమవుతుందని భావించి పంపకాలకు తెర తీశారు. ఇప్పటికే నిర్వహించిన ఐవీఆర్ఎస్, ఇంటెలిజెన్స్ సర్వే ప్రక్రియను పక్కనబెట్టారు. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పరిధిలోని 60 శాతం నామినేటెడ్ పోస్టులు ఆ పార్టీ కార్యకర్తలకే దక్కుతాయి. 30 శాతం జనసేనకు, 10 శాతం బీజేపీకి కేటాయిస్తారు. జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో 60 శాతం ఆ పార్టీ కార్యకర్తలకు, 30 శాతం టీడీపీకి, 10 శాతం బీజేపీకి వరించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం బీజేపీ నేతల్లో అగ్రహావేశాలు నింపింది. జాతీయ పార్టీ నేతలకు కేవలం పది శాతం కేటాయించడంపై వారు వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో వెనక్కు తగ్గిన బాబు ఏం చేయాలో అర్థంకాక మరో విధానానికి తెర తీశారు. ఎమ్మెల్యేల సిఫార్సులు తప్పనిసరి అని చెప్పడంతో కష్టపడిన నేతలకు కాకుండా ఎమ్మెల్యేల అడుగులకు మడుగులొత్తిన వారికి మాత్రమే పదవులు దక్కే అవకాశం ఉందన్న భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు తమ అనుచరుల పేర్లను అధిష్టానానికి ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం.



టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



బొడ్డు వెంకటరమణ చౌదరి

ఇద్దరు ప్రధాన నేతలకూ మొండిచేయేనా..?

- నామినేటెడ్ పదవుల నియామకంలో టీడీపీ అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని పరిశీలిస్తే తూర్పుగోదావరి జిల్లాలో ఇద్దరు ప్రధాన టీడీపీ నేతలకు నామినేటెడ్ దక్కే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.
- టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు ఎమ్మెల్యే సీటు గల్లంతైంది. అప్పట్లో చంద్రబాబు పిలిపించుకుని జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్, శేషారావు మధ్య సయోధ్య కుదిర్చారు. ఆ సమయంలో శేషారావుకు ఎమ్మెల్సీ ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రస్తుతం ఆయనతో పాటు మరో నేత పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ నేత పేరుతో అభిప్రాయ సేకరణ జరుగుతుండటంతో శేషారావుకు స్థానం దక్కడంపై సందిగ్ధం నెలకొంది. దీనికి తోడు శేషారావు వర్గానికి సైతం పూర్తి స్థాయిలో పదవులు దక్కే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.
- రాజానగరం ఎమ్మెల్యే స్థానం జనసేనకు కేటాయించి టీడీపీ అభ్యర్థి బొడ్డు వెంకటరమణ చౌదరికి మొండిచేయి చూపారు. ఆయనకు ప్రభుత్వంలో కీలక పదవి ఇచ్చి గౌరవిస్తానని స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. పదవిపై నేటికీ స్పష్టత ఇవ్వలేదు. దీనికి తోడు రాజానగరం మండలానికి చెందిన జనసేన నేతకు మరొక పదవి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరమైనట్లు తెలిసింది. ఇక్కడ జనసేన ప్రాతనిధ్యం వహిస్తుండడంతో 60 శాతం పదవులన్నీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వర్గానికి దక్కుతాయి. దీంతో బొడ్డు వర్గం పరిస్థితి ఏంటన్న ప్రశ్న టీడీపీ శ్రేణుల్లో ఉత్పన్నమవుతోంది. అంతేగాక బొడ్డు, ఎమ్మెల్యే బత్తుల వర్గాలకు మధ్య వర్గ విభేదాలు చాలానే ఉన్నాయి. బొడ్డుకు పదవిపై ఎమ్మెల్యే బత్తుల సహకరించే పరిస్థితి లేదు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నాయి.

భజే గణనాయకా..



విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. స్వామికి మహానివేదన అనంతరం పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 44 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 19 మంది, నూతన వాహన పూజ 40 మంది, చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అన్నదాన పథకంలో 1,425 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,02,254 ఆదాయం లభించిందని అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు జలవనరుల శాఖ అధికారులు ఆదివారం నీటి విడుదలను తగ్గించారు. వర్షాలు కురవడంతో పశ్చిమ డెల్టా పరిధిలో రైతుల ఖరీఫ్ సాగు నీటి అవసరాల మేరకు నీటి విడుదలను తగ్గిస్తున్నారు. పశ్చిమ డెల్టాకు రెండు వేల క్యూసెక్కులు విడుదల చేశారు. డెల్టా పరిధిలో ఉన్న ఏలూరు కాలువకు 783 క్యూసెక్కులు, నరసాపురం కాలువకు 1534 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 236 క్యూసెక్కులు, తణుకు కాలువకు 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 12.83 మీటర్లు నమోదయ్యింది.

క్లుప్తంగా

పిచ్చుకలంకను పర్యాటకంగా మార్చుతాం..

● కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్


పిచ్చుకలంక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆ ప్రాంతాన్ని వివిధ శాఖలు, పర్యాటక రంగ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఇప్పటికే జల వనరుల శాఖ అధికారులు పర్యాటక రంగ అభివృద్ధికి అప్పగించిన 56 ఎకరాల స్థలాన్ని చూశారు. అప్రోచ్ రోడ్డు, రాకపోకలకు భూమి స్థితిగతులు తదితర అంశాలపై పర్యాటక అధికారులతో చర్చించారు.

మ్యాప్‌ల ఆధారంగా సరిహద్దులను అడిగి తెలుసుకున్నారు. పిచ్చుకలంక ప్రాంతాన్ని పర్యాటక రంగ అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పరంగా సన్నాహాలు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ, జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు, రెవెన్యూ, పర్యాటక, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సహచర కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న పోలీసు అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఆస్పత్రిలో ఉన్న తమ సహచర ఉద్యోగికి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అండ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఏఆర్అండ్ఎంటీ) విభాగం పోలీసులు రూ.2.50 లక్షల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. స్థానిక జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో కానిస్టేబుల్ వి.శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. సహచర సిబ్బంది రక్తదానంతో పాటు, ఆర్థికసాయాన్ని అందజేశారు. అడిషనల్ ఎస్పీ ఎల్.చించిరెడ్డి, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం ఈ సాయాన్ని శ్రీనివాస్ భార్యకు అందించారు.

రెక్కలు తొడిగి.. రెపరెపలాడి

- విదేశీ విహంగాల సందడి
- ఏటా అతిథుల ఆగమనం
- పడమర చోడవరంలో విశిష్టత

నల్లజర్ల: ఇక్కడే పుడతాయి.. ఎక్కడో పెరుగుతాయి.. సంతానోత్పత్తి కోసం మళ్లీ ఇక్కడికే వస్తాయి.. నాలుగైదు నెలల పాటు సందడి చేస్తాయి. ఆకాశ మార్గంలో వేల మైళ్లు ప్రయాణించి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పడమర చోడవరానికి ఏటా వచ్చే సైబీరియా పక్షులను అంతా అపురూపంగా చూసుకుంటున్నారు. వాటి రాకతో పడమర చోడవరం సందడిగా మారుతోంది. ఆ పక్షులు గ్రామానికి వస్తున్నాయంటే వర్షాలు ప్రారంభం కాబోతున్నాయన్న సంకేతంగా ఇక్కడి వారు భావిస్తుంటారు. జూలై చివరిలో వచ్చిన ఈ పెలికాన్ పక్షులు చెట్లపై గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టి పొదిగి ఆ పిల్లలు పెద్దవయ్యాక వాటితో కలసి నవంబర్‌లో తిరిగి ప్రయనమవుతాయి. ఈ క్రమంలో పక్షుల కిలకిలరావాలు గ్రామస్తులకు ఎంతో ఆనందాన్నిస్తాయి. జంటలుగా సంచరించడం, పక్షి పిల్లలకు ఆహారం తినిపించడం, నీరు తాగించడం, వాటికి ఎగరడం నేర్పించడం వంటి కనువిందైన సన్నివేశాలు మానసికోల్లాసం కలిగిస్తుంటాయి. ఇది ఏన్నో ఏళ్ల నుంచి జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. ఈ పక్షుల రాకతో తమ గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తులు విశ్వసిస్తుంటారు. వీటిని ప్రత్యేక అతిథులుగా భావించిన సంరక్షణకు చొరవ చూపడంతో పాటు ప్రాణ హాని, భయం లేకుండా ఆహార అన్వేషణకు పరిసరాల్లో స్వేచ్ఛగా సంచరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పక్షుల రాకను గుర్తించిన పడమర వన్యప్రాణి యాజమాన్య విభాగం ఓ బోర్డును కూడా ఏర్పాటు చేసింది. ఈ గ్రామంలో మొత్తం ఐదు వేల మంది జనాభా ఉండగా, ఎక్కువగా రామాలయం సెంటర్‌లో ఈ పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. తాటి, చింత చెట్లే వీటికి ఆవాసాలు అవుతున్నాయి.

గుడ్లు పొదిగి.. ఆహారం అన్వేషించి

చెట్లపై గూళ్లు కట్టుకున్న తర్వాత ఆడ, మగ పక్షులు ఒకదానితో ఒకటి తొక్కిళ్లు పడతాయి. ఇలా సంపర్కం తర్వాత 10–12 రోజులకు ఆడపక్షి రోజుకొకటి చొప్పున రెండు నుంచి నాలుగు గుడ్లు పెడుతోంది. ఆ తర్వాత గుడ్లను పొదుగుతోంది. ఆ కాలంలో మగ పక్షి పొలాల్లోకి వెళ్లి నత్తలు, చిన్న చిన్న చేపలు, కీటకాలను తెచ్చి ఆడపక్షి నోట్లో జారవిడుస్తోంది. 21 రోజులకు గుడ్లు పగిలి పిల్లలు బయటకు వస్తాయి. ఆ తర్వాత ఆడ, మగ పక్షులు ఆహారాన్ని వేటాడి తెచ్చి పిల్లలకు పెడుతుంటాయి. ఇలా విదేశీ పక్షులకు చోడవరం పుట్టిల్లుగా మారింది. ఇవి గ్రామంలోకి రాగానే వీటి సంరక్షణ బాధ్యతలను గ్రామస్తులే చేపడతారు. గతంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా పని చేసిన అల్లూరి కృష్ణారావు స్వగ్రామం ఇదే. ఎవరైనా పక్షులను వేటాడారని తెలిస్తే పిలిచి కొరడాలతో కొట్టేవారని చెబుతుంటారు. ఆనాటి నుంచి ఎవరైనా పక్షులను వేటాడినా ప్రజలే జరిమానా విధిస్తారు. దీంతో వేటగాళ్లు ఎవరూ ఈ పరిసర ప్రాంతాలకు రారు.


పడమర చోడవరంలో పక్షుల సందడి


వన్యప్రాణి యాజమాన్య విభాగం ఏర్పాటు చేసిన బోర్డు


ఓ చెట్టుపై సైబీరియా పక్షులు

జన్మ స్థలం ఇదే..

పక్షులు పర్యావరణంలో భాగస్వాములు. వాటి ఆదరణే పర్యావరణ పరిరక్షణ అంటూ గ్రామ ముఖ ద్వారంలో వన్యప్రాణి యాజమాన్య విభాగం వారు స్వాగత బోర్డు ఏర్పాటు చేశారు. పక్షి ప్రేమికుల స్వర్గధామం– మీముందుంది పడమర చోవడరం అంటూ స్వాగతం పలుకుతున్నారు. ఇది అందరినీ ఆకర్షిస్తోంది.

చిన్నతనం నుంచీ చూస్తున్నాం..



చిన్నతనం నుంచీ పెలికాన్ పక్షులను చూస్తున్నాం. ఇవి వస్తేనే వానలొస్తాయని, పంటలు పండుతాయని నమ్మకం. వీటి రాక ఆలస్యమైతే ఆ ఏడాది వర్షాలు ఆలస్యమవుతుంటాయి. ఇక్కడ ఆరు మాసాలు ఉండే పక్షులకు ఎటువంటి హాని లేకుండా గ్రామస్తులు చూస్తుంటారు. చెట్లు నరికేయడంతో పక్షులకు స్థావరాలు కరువైనట్లు కనపడుతోంది. వీటికి ప్రత్యేక రీతిలో చెట్లు పెంచితే బాగుంటుంది.

–అయినం నాగేశ్వరరావు, పడమర చోడవరం

పర్యాటకంగా గుర్తించాలి



జిల్లాలో ఇటువంటి పక్షులు అరుదుగా కనిపిస్తాయి. నాలుగైదు మాసాలు విదేశీ పక్షులు సందడి చేసే ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా గుర్తించాలి. అప్పుడే ఈ విషయం అందరికీ తెలుస్తుంది. ఈ విషయంలో ప్రభుత్వ ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

–కొత్తపల్లి రమేష్, రైతు, పడమర చోడవరం

28 గ్రాముల బంగారం చోరీ

నల్లజర్ల: బంగారు ఆభరణాలు కనబడడం లేదంటూ ఓ యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శింగరాజుపాలేనికి చెందిన వడ్లమూడి హిమబిందు ఆ గ్రామంలో వస్త్ర దుకాణం నిర్వహిస్తోంది. ఆ షాపును ఇంటికి తరలించడం కోసం అదే గ్రామానికి చెందిన యంత్రపాటి రాజుకు చెందిన టాటా ఏసీ వాహనం అద్దెకు మాట్లాడుకుంది. సామగ్రి అంతా రాజుతో పాటు మరో వ్యక్తి ఇంటికి తరలించారని, ఈ నేపథ్యంలో ఒక పెట్టెలో ఉండాల్సిన 28 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో వారిని పిలిచి అడిగింది. తమకేమి తెలియదని చెప్పడంతో శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన అండర్–23 జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అండర్–23 క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికలను అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి, పీడీ సుబ్రహ్మణ్యం, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ వర్మ ప్రారంభించారు. రన్, జంప్, త్రోస్‌లో నిర్వహించిన ఎంపికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 12 మంది పురుషులు, 10 మంది మహిళలను నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సెప్టెంబర్ 14 నుంచి 19 వరకూ గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. పీఆర్ పీడీ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలు తేవాలని కోరారు. ఈ ఎంపికల నిర్వహణలో సంఘ నిర్వహణా కార్యదర్శి గిరి, అథ్లెటిక్స్ కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కీర్తి మెడికల్ స్టోర్స్ చైర్మన్ తిరుపతిరెడ్డి

కాకినాడ క్రైం: ఫార్మా రిటైర్ రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా వెలుగొందుతున్న కీర్తి మెడికల్ స్టోర్స్ తన 23వ బ్రాంచ్‌ను కాకినాడ భానుగుడి కూడలిలో ఆదివారం ప్రారంభించింది. సంస్థ చైర్మన్ ఎల్.తిరుపతి రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా, ముఖ్య అతిథిగా హాజరైన ప్రఖ్యాత గుంటూరు జనని ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ నిపుణురాలు ముక్కు కవిత ఈ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భానుగుడి కూడలిలో ఏర్పాటైన తమ స్టోర్ ఉభయగోదావరి జిల్లాలోనే అతి పెద్దదన్నారు. సర్జికల్స్, బేబీ కేర్ ప్రొడక్ట్స్ మొదలు మధుమేహం నుంచి హెచ్ఐవీ వరకూ సుమారు 35 వేల రకాల బ్రాండెడ్ మందులు తమ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. 24 గంటల పాటు సేవలందించాలనే సదుద్దేశంతో అన్ని వేళల్లోనూ తమ స్టోర్ తెరిచి ఉంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో వరంగల్, ఖమ్మంలో తమమరో రెండు బ్రాంచ్‌లు ప్రారంభం కానున్నాయన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు

జిల్లా జట్టు ఎంపిక


డీఎస్ఏలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కాకినాడ జిల్లా క్రీడా మైదానం క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ అన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో 30వ సీనియర్స్, జూనియర్స్ తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు అధ్యక్షత వహించారు. డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తిని పెంపొందించారన్నారు. గత 30 ఏళ్లుగా జిల్లాలో తైక్వాండో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంఘ కార్యదర్శి, కోచ్ బి.అర్జునరావును డీఎస్‌డీఓ అభినందించారు. సంఘ కార్యదర్శి అర్జునరావు మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పురుషులు, మహిళల విభాగాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో 36 మందిని ఎంపిక చేస్తామన్నారు. అనంతరం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 90 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల నిర్వహణలో తైక్వాండో కోచ్‌లు సత్యనారాయణ, అప్పారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఏడున్నర కిలోల గంజాయి స్వాధీనం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు

కాకినాడ రూరల్: కాకినాడ పరిసర ప్రాంతాల్లో గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురిని ఇంద్రపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి ఏడున్నర కిలోల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ డీఎస్పీ డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జగన్నాథపురం గోశీలపేటకు చెందిన పాలెపు సతీష్, యానాం గిరిజన పేటకు చెందిన కర్రి శామ్యూల్, కాకినాడ పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన మరువాడ శ్రీనివాస్, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వెనుక వీధికి చెందిన బోయి వెంకటరమణ, కాకినాడ డైరీ ఫారం సెంటర్‌కు చెందిన కలపరెడ్డి శివకుమార్, కాకినాడ సంజయ్‌నగర్ ప్రాంతానికి చెందిన వీరిని ప్రభుతేజలు గంజాయి రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. చీడిగ గ్రామ శివారు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర్లో వారు ఉండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపుతున్నట్లు డీఎస్పీ చెప్పారు. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆయన వివరించారు. యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్‌ఐ వి.మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల విభాగం పరిశీలన


సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటి పనితీరుపై కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా అంతటా ఉన్న 481 సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. వీటి ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. జిల్లా అంతటా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నిత్యం 24 గంటల పాటు పర్యవేక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు, తమ ఇళ్లు, ఆఫీస్ చుట్టుపక్కల ప్రైవేట్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇలా చేయడం ద్వారా భద్రతా, నిఘా పెంచుకోవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు దుర్గారావు

నిడదవోలు: స్థానిక శివారు ఒకటో వార్డు రామ్‌నగర్‌లో నిడదవోలు– చాగల్లు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఒకటో వార్డు రామ్‌నగర్‌లో నివాసముంటున్న కాగిత దుర్గారావు (40) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే కూలి పనికి వెళ్లి శనివారం రాత్రి ఇంటికి తిరిగి వస్తున్నాడు. నిడదవోలు నుంచి చాగల్లు వెళుతున్న మోటార్ సైకిల్‌పై ముగ్గురు యువకులు ప్రయాణిస్తూ అతివేగంగా వచ్చి దుర్గారావును ఢీకొన్నారు. ఈ ఘటనలో దుర్గారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని స్థానికులు నిడదవోలులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అత్యవసర వైద్య సేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు దుర్గారావుకు భార్య దుర్గ భవానితో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతుడి అన్నయ్య కాగిత వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఏఎస్సై వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతుడి ఫైల్ ఫొటో

తుని: స్థానిక జీఆర్పీ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. అన్నవరం రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫామ్ శివారున గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 35–40 ఏళ్ల వ్యక్తి శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు, ఆరెంజ్ రంగు గడుల చొక్కా, నీలం రంగు జీన్ ఫ్యాంట్ ఉందన్నారు. మృతుడి పర్స్‌లో రైల్వే ప్లాట్‌ఫామ్ టిక్కెట్ ఉందని, ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మారూఫ్ వివరించారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష


జాగ్రత్తలు పాటించకుండా పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు


సేఫ్టీ సూట్ ధరించి మందును పిచికారీ చేస్తున్న రైతు

- పురుగు మందుల పిచికారీలో అప్రమత్తత
- ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం
- వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

ఆలమూరు: పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు అవసరం. లేకుంటే ప్రాణానికే ప్రమాదం. తగిన జాగ్రత్తలే శ్రీరామరక్ష అని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్షలాది ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. అలాగే వరితో పాటు వివిధ పంటలపై తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంటోంది. వీటిని నివారించకపోతే పంట దిగుబడులపై ప్రభావం పడుతోంది. పంటల సంరక్షణకు అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన పురుగు మందులను రైతులు విరివిగా వాడుతున్నారు. వీటి పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో కొంత మంది అవగాహన లేమితో మందులను పిచికారీ చేసేటప్పుడు కనీస జాగ్రత్తలను పాటించడం లేదు. దీనివల్ల విష ప్రభావానికి గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ సూచనల మేరకు సేఫ్టీ సూట్ లేదా రైతులు శరీరం అంతా కప్పబడేలా దుస్తులతో పాటు నోటికి వస్త్రం మాస్కులు ధరించాలి.

పాడి-పంట

మందుల ప్రభావం ఇలా..

పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రసాయనాల ప్రభావం మూడు రకాలుగా ఉంటుంది. ఈ మందుల నుంచి వెలువడే విష వాయువులను ముక్కు నుంచి పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. పురుగు మందుల మోతాదు ఎక్కువైనప్పుడు ఒక్కోసారి విష వాయువు చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించే వీలుంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే ఈ తీవ్రత మరింత అధికంగా ఉంటుంది. పురుగు మందులు పిచికారీ చేసిన తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కోకపోవడం వల్ల భుజించే ఆహార పదార్థాలతో నోటి ద్వారా విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. పిచికారీ చేస్తూ పొగ తాగినా విష వాయువు రూపంలో శరీరంలోకి వెళ్లే ప్రమాదముంది.

చికిత్స విధానం

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు నీటితో శుభ్రం చేయాలి. ఒకవేళ కంట్లో పడితే మంచినీటితో కడగాలి. పురుగు మందును ముక్కుతో పీల్చి ప్రమాదానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు ఎక్కువగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటే కృత్రిమ శ్వాసను అందించేలా ఏర్పాటు చేయాలి. వీలైనంత త్వరగా సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అందించాలి. క్రిమి సంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్లినప్పుడు వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసు నీళ్లలో ఉప్పును లేదా ఆవాల పొడిని తగినంత మోతాదులో కలపి తాగించాలి. కడుపు ఖాళీ అయ్యే వరకూ అలా తాగిస్తూనే ఉండాలి. అనంతరం వైద్యుడి వద్దకు తీసుకు వెళ్లి చికిత్స అందించాలి.

అవగాహన కల్పిస్తున్నాం..



పురుగు మందుల పిచికారీ సమయంలో రైతులు కనీస జాగ్రత్తలు పాటించాలి. వీలైనంత మేరకు సేఫ్టీ సూట్ ధరించడం, లేకుంటే శరీరానికి, నోటికి వస్త్రాలు కట్టుకోవాలి. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వ్యవసాయాధికారులకు తెలియజేసి స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలి. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

–కె.నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఉపసంచాలకుడు, ఆలమూరు డివిజన్